క్లుప్తంగా

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



ఏడీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

సంగారెడ్డి రూరల్: మత్స్యకారుల ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఫిషరీస్ డిపార్మెంట్ ఏడీ నరసింహారావుతో కలిసి, నియోజకవర్గంలోని చెరువులు, కుంటల్లో చేప పిల్లల విత్తనాల పంపిణీపై చర్చించారు.

వైభవంగా ధ్వజస్తంభ స్థాపన



రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని హనుమాన్ మందిరం పునఃప్రారంభోత్సవంలో భాగంగా సోమవారం నూతన ధ్వజస్తంభ స్థాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. శ్రీరామ, హనుమ నామాలను స్మరిస్తూ అత్యంత భక్తిశ్రద్ధలతో క్రేన్ సహాయంతో ధ్వజ స్తంభాన్ని స్థాపించారు. ఆధ్యాత్మిక గురువులు, భక్తి ప్రవచనాలను భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. ఈ సందర్భంగా చేపట్టిన సప్తహ భజన కార్యక్రమాన్ని ముగించారు. కార్యక్రమంలో నాయకులు, దాతలు, భక్తులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కమిషనర్

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా పని చేయాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మున్సిపాలిటీ చెత్త సేకరణ వాహనాల డ్రైవర్లకు అవగాహన కల్పించారు. చెత్త సేకరణ సమయంలో గృహాల వారికి తడి, పొడి చెత్త వేర్వేరుగా ఉంచి వాహనాల్లో వేసేలా డ్రైవర్లు అవగాహన కల్పించాలని సూచించారు.

బహుమతుల పంపిణీ

నారాయణఖేడ్: దసరా పండుగ సందర్భంగా ఖేడ్ ఆర్టీసీ డిపోకు 10 రోజుల్లో రూ.1.30 కోట్ల కలెక్షన్ వచ్చింది. ఆదాయం వచ్చేలా కృషి చేసిన డిపో కార్మికులు, ఉద్యోగులకు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక ఆర్టీసీ డిపోలో డీఎం మల్లేశయ్య స్టీల్ వాటర్ బాటిళ్లను అందజేశారు. ప్రయాణీకులకు మెరుగైన సేవలను అందించి అధిక ఆదాయం వచ్చేలా కష్టపడాలన్నారు.

విద్యార్థులకు అప్రెంటిస్ మేళా

హత్నూర (సంగారెడ్డి): హత్నూర ఐటీఐలో వివిధ విభాగాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సోమవారం అప్రెంటిస్ మేళా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మి తెలిపారు. అప్రెంటిస్ మేళాకు 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎలక్ట్రిషన్ 18 మంది విద్యార్థులు, వెల్డర్ 10 మంది విద్యార్థులు, మోటార్ మెకానికల్ వెహికల్ నలుగురు, ట్విట్టర్ 5 మంది విద్యార్థులను ఆయా పరిశ్రమల ప్రతినిధులు ఎంపిక చేసుకున్నట్లు ఆమె తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ప్రతి నెల వివిధ పరిశ్రమలు రూ.8800 నుంచి రూ.13 వేల వరకు స్టైఫండ్, భోజనం, టిఫిన్ వసతితో సంవత్సరం ట్రైనింగ్‌తో పాటు అప్రెంటీస్ తర్వాత ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ చెప్పారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌గా లక్ష్మి

వట్‌పల్లి (అందోల్): వట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా అల్లాదుర్గ్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కొప్పుల లక్ష్మిని నియమించారు. అలాగే, వైస్ చైర్మన్‌గా ఖాదిరాబాద్ కు చెందిన మన్నె ఈశ్వరయ్యను నియామిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డైరెక్టర్లుగా చిన్నెల్లి పాపయ్య, దిగంబర్‌రావు, దేవసత్ రాజ్, మహ్మద్ అబ్దుల్ ఫజిల్, మద్దూరి రాజు గౌడ్, కుమ్మరి సాయిలు, సయ్యద్ హబి బుద్దీన్, బద్రారెడ్డి, సంఘమేశ్వర్, లక్ష్మయ్య, నాగయ్య, శ్రీధర్‌లు కమిటీ సభ్యులుగా నియామకమయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మంత్రి దామోదర్ రాజనర్సింహాకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ధర్నా

జహీరాబాద్: కొత్తగా తీసుకువచ్చిన పాలసీలను నిరసిస్తూ ఎల్ఐసీ ఏజెంట్లు ధర్నా నిర్వహించారు. సోమవారం భోజన సమయంలో సంస్థ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ నెల ఆరంభం నుంచి తీసుకువచ్చిన సెవెన్ సిరీస్‌తో కొత్త పాలసీలను జహీరాబాద్, నారాయణఖేడ్ నియోజకవర్గాలకు చెందిన ఏజెంట్లు చేయొద్దని లియాఫీ సంఘం నిర్ణయం తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ నెల 28 వరకు ధర్నా కొనసాగించాలని నిర్ణయించారు.

అడుగుకో గుంత.. తప్పదు చింత

- అధ్వానపు రోడ్లతో అగచాట్లు
- ప్రమాదాల బారిన ప్రయాణికులు
- మరమ్మతులు చేయించాలని వేడుకోలు



నందిగామ చౌరస్తా వద్ద రోడ్డు దుస్థితి



పాడైన పటేల్‌గూడ పంచాయతీ పక్కన రోడ్డు

పటాన్‌చెరు: నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పటాన్‌చెరు- ఇంద్రేశం మీదుగా మల్కాపూర్ రోడ్డుతో పాటు పటాన్‌చెరు- భానూర్ రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పటాన్‌చెరు భానూర్ మీదుగా రెండు జిల్లాలను కలుపుతూ ఉన్న రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు పక్కనే విశాఖ స్టీల్, కంటైనర్ కార్పొరేషన్ సంస్థలు ఉన్నాయి. ఆ సంస్థలకు ప్రతి రోజు వందలాది వాహనాలు వస్తుంటాయి. దీంతో భానూర్ రోడ్డులో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. భానూర్ రోడ్డు, ఇటు హైదరాబాద్- ముంబాయి, అటు బెంగళూరు- హైదరాబాద్ రోడ్డుకు అనుసంధానంగా ఉంటుంది. భానూర్ నందిగామ ప్రాంతాల్లో ఇంటర్నేషన్ కాలేజీలు , స్కూళ్లు ఉన్నాయి. అలాగే, పాశమైలారం పరిశ్రమకు వెళ్లే వాహనాలు కూడా కర్దనూర్ జంక్షన్ వరకు వస్తున్నాయి. దీంతో ఆ రోడ్డులో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. రోడ్డు గోతులమయం కావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి గంటల తరబడి ట్రాఫిక్ ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. గోతుల కారణంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నట్లు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇంద్రేశం మీదుగా మల్కాపూర్ రోడ్డుపై పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీనిని కూడా మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. నియోజకవర్గం పరిధిలో ఈ రెండు రోడ్లు పూర్తిగా పాడైయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే మరమ్మతులు చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

విస్తరణకు రూ.95 కోట్లు అవసరం

పటాన్‌చెరు-భానూర్ రోడ్డు విస్తరణకు రూ.95 కోట్లు అవసరం. ఆ మేరకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. ఇప్పుడున్న రోడ్డుకు మరమ్మతులు త్వరలోనే చేపడతామని ఆర్ అండ్ బీ డీఈఈ రామకృష్ణ చెప్పారు. పటాన్‌చెరు మల్కాపూర్ రోడ్డుకు మరమ్మతులు చేసేందుకు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు.

– రామకృష్ణ, డీఈఈ, ఆర్‌అండ్‌బీ

క్యాన్సర్‌పై అవగాహన వారోత్సవాలు

మాజీ లయన్స్‌క్లబ్ గవర్నర్ రవీందర్‌గౌడ్



జగన్మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

జోగిపేట(అందోల్): లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వారం రోజులు క్యాన్సర్‌పై అవగాహన వారోత్సవాలు నిర్వహించనున్నట్లు మాజీ లయన్స్‌క్లబ్ గవర్నర్ డాక్టర్ ఎస్.రవీందర్‌గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. అక్టోబర్ 19 నుంచి 25వరకు ఈ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రత్యేక నిపుణులచే అవగాహన కల్పిస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. గత నెలలో వారం రోజుల పాటు వేలాది మంది విద్యార్థిని, విద్యార్థులకు దంత పరీక్షలు, మందులు అందించారన్నారు. ప్రతి ఒక్క సభ్యుడు రూ.10వేలు చెల్లించి ట్రస్ట్‌లో సభ్యుడిగా చేరాలన్నారు. అనంతరం లయన్స్‌క్లబ్ సభ్యుడు ఎం.జగన్మోహన్‌రెడ్డిని ఏఎంసీ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. కావున, క్లబ్ తరపున ఆయనను ఘనంగా సన్మానించారు. జిల్లా కార్యదర్శులు డాక్టర్ అనంతరెడ్డి, ఎస్.జగన్మోహన్‌రెడ్డి, ఎ.రాంబాబు, జోన్ చైర్మన్ రామకృష్ణ, క్లబ్ కోశాధికారి జి.సంతోష్‌కుమార్, సభ్యులు ఎస్.నారాయణరెడ్డి, ఎస్.కృష్ణారెడ్డి, యశ్వంత్‌రెడ్డి, డాక్టర్ జగదీశ్వర్, దయానంద్, జాన్‌పాల్, పి.సంతోష్‌కుమార్, మల్లేశం, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోండి

విశ్వహిందూ పరిషత్
రాష్ట్ర కో-కన్వీనర్ సుభాష్ చంద్ర

పటాన్‌చెరు టౌన్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కోకన్వీనర్ సుభాష్ చంద్ర అన్నారు. సోమవారం పటాన్‌చెరు సీఐ ప్రవీణ్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా సుభాష్ చంద్ర మాట్లాడుతూ.. యాదాద్రి గుట్టకు కుటుంబ సభ్యులతో వెళ్లిన కౌశిక్‌రెడ్డి ఆలయ ఆవరణలో రీల్స్ తీసి, సోషల్ మీడియాలో పెట్టడం దేవాలయ పవిత్రను దెబ్బతీయడమేనని మండిపడ్డారు. సామాన్య భక్తులకు ఫొటోలు తీయడానికి అనుమతించని సిబ్బంది, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రీల్స్ తీసేందుకు ఎలా అనుమతించారని ప్రశ్నించారు. కౌశిక్ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, భక్తుల మనోభావాలు కాపాడాలని డిమాండ్ చేశారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

కాంప్లెక్స్ హెచ్ఎం రాజశ్రీ



విద్యార్థిని ప్రశ్నలు అడుగుతున్న రాజశ్రీ

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాలను సోమవారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు రాజశ్రీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఏ1 పరీక్షలను, పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలను పరిశీలించారు. నాల్గవ తరగతి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. వారు సరైన సమాధానాలు చెప్పటంతో సంతోషించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాల ఉపాధ్యాయులు బోధన, విద్యార్థుల ప్రదర్శన, పాఠశాల వాతావరణం చక్కగా ఉందన్నారు. పాఠశాలలో వివిధ రకాల పోస్టర్స్ యొక్క ప్రదర్శన చాలా బాగుందన్నారు. ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ పాఠశాల రికార్డులను చాలా చక్కగా నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పోట్రు రామకృష్ణ, ఉపాధ్యాయులు నవనీత, సీఆర్పీ నాగేష్ పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయాలి

చిత్ర దర్శకుడు నీలకంఠ



సమావేశంలో మాట్లాడుతున్న నీలకంఠ

పటాన్ చెరు టౌన్: నిజమైన సృజనాత్మకత లోపల నుంచి వస్తుంది. దానిని బోధించలేమని రెండు జాతీయ, ఐదు నంది అవార్డులను గెలుచుకున్న ప్రఖ్యాత చిత్ర దర్శకుడు నీలకంఠ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్-లో 'షూటింగ్ నీలకంఠ' పేరిట సోమవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులతో తన అంతర్దృష్టిని పంచుకున్నారు. బహుముఖ ప్రజ్ఞ, వినూత్నమైన కథలు, సినిమాల్లో మార్పులేని తనం ప్రాముఖ్యతలను వివరిస్తూ, 'ఒక్కొక్కటి మూడు లేదా నాలుగు కళా ప్రక్రియల కలయికతో నేను విభిన్న రకాల చిత్రాలను చేశాను. ప్రయోగాలు చేస్తూ ఉండండి, అది మీ మనస్సును చురుకుగా, సజీవంగా ఉంచుతుంది. మీరు ఎల్లప్పుడూ కొత్తదనాన్ని ఉత్పత్తి చేస్తున్నారని నిర్ధారించుకోవడానికి తాజా ఆలోచనలతో విభిన్న మార్గాలను అనుసరించండి' అని ఉద్బోధించారు. నీలకంఠ, ఆయన పనితీరును పరిచయం చేస్తూ షో, మిస్సమ్మ సహా ఆయన సినిమాలు బలమైన పాత్రలు, అర్థవంతమైన కథలు, వినోదం, ఆత్మపరిశీలన మధ్య సమతుల్యతను సాధించడంలో ప్రతిభను ప్రదర్శిస్తాయన్నారు. కార్యక్రమంలో వెంకట సుబ్బు, డాక్టర్ సుష్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు న్యాయం చేయండి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేస్తున్న రైతులు, నాయకులు

జిన్నారం (పటాన్ చెరు): ప్రభుత్వం రైతుల నుంచి తీసుకున్న భూములకు సంబంధించి ఎకరాకు 600 గజాల స్థలాన్ని కేటాయించాలని కోరుతూ తహసీల్దార్ భిక్షపతికి బాధిత రైతులు వినతిపత్రం అందజేశారు. సోమవారం జిన్నారం, జంగంపేట గ్రామాల రైతులు, బీఆర్ఎస్ నాయకులు రెవెన్యూ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సర్వేనంబర్ 1001, 376లో గల రైతుల భూములను హెచ్ఎండీఏకు కేటాయించారు. నష్టపరిహారం కింద ఒక ఎకరాకు 600 గజాలు ఇస్తామని చెప్పి, రెండు సంవత్సరాలు గడిచినా ఎలాంటి పరిహారం ఇవ్వలేదని వాపోయారు. తక్షణమే ప్రభుత్వం బాధితులకు హెచ్ఎండీఏ లేఅవుట్ చేసి ఎకరాకు 600 గజాల ప్లాట్లను ఇవ్వాలన్నారు. లేని యెడల రైతుల నుంచి తీసుకున్న భూములను తిరిగి పట్టాలు చేసి అప్పగించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు రైతుల పక్షాన పోరాటాన్ని కొనసాగిస్తామని అధికారులను హెచ్చరించారు. ఉమ్మడి మండలాల నాయకులు మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేశం గౌడ్, నాయకులు గోవర్ధన్ రెడ్డి, స్థానిక నాయకులు బాధిత రైతులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు భిక్షకాదు.. హక్కు



సమావేశంలో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

జహీరాబాద్: పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని వశిష్ట డిగ్రీకళాశాలలో ఏబీవీపీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పాలకులు మారినా ప్రజల బతుకులు మారడం లేదన్నారు. గత పాలకులు విద్యారంగాన్ని పూర్తిగా నాశనం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం సైతం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ మరింత విధ్వంసం చేస్తుందని విమర్శించారు. గతం కంటే బడ్జెట్‌ను తక్కువగా కేటాయించిందని గుర్తు చేశారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు కార్తీక్ సాగర్, విశాల్, మల్లేష్, వినోద్, మిథున్ పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 24 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఐటీఐ ఏర్పాటు అభినందనీయం

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌లో ఐటీఐ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయమని ఏఐఎఫ్ఎస్ జిల్లా కార్యదర్శి తెంకటి కుమార్ తెలిపారు. ఐటీఐ వృత్తి విద్యాకోర్సులతో పేద విద్యార్థులకు తొందరగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. నియోజకవర్గంలో విద్యపరంగా అభివృద్ధి కోసం ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రత్యేక చొరవ చూపుతుండటం హర్షనీయమన్నారు.

గౌరమ్మకు ప్రత్యేక పూజలు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని మహిళలు భక్తిశ్రద్ధలతో గౌరమ్మ పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కౌన్సిలర్ చంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దేవీదేవతల పూజలతో ఆధ్యాత్మిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా మహిళలు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానికులు శేఖర్, రవితేజ, ముత్యాలు, విజయ, రాజేశ్వరి, తేజమ్మ, ఇందిరా, అమ్ములు, తులసమ్మ కాలనీ మహిళలు పాల్గొన్నారు.

ఆలయాలపై దాడి హేయం

జిన్నారం (పటాన్‌చెరు): ఆలయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ జిన్నారం మండల కేంద్రంలో సోమవారం హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు రాజకీయాలకు అతీతంగా నిరసన ర్యాలీ చేపట్టారు. ఇటీవల సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో జరిగిన ఘటన అత్యంత హేయమైన చర్య అన్నారు. దేవాలయాలపై దాడులను ఖండిస్తున్నామన్నారు. దాడులు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండలంలోని హిందువులు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సత్కారం



ఎక్సలెన్సీ అవార్డు అందుకుంటున్న సిద్ధారెడ్డి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి టీచర్ ఎక్సలెన్సీ అవార్డు గ్రహీతలకు ఆదివారం హైదరాబాద్‌లోని బిర్లా భాస్కర ప్లానిటోరియంలో సత్కారం నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి, సమాజ శ్రేయస్సుకు పాటుపడుతున్న ఉపాధ్యాయులకు ఈ అవార్డును అందజేశారు. అవార్డుకు ఎంపికైన జెడ్పీహెచ్ఎస్ కోర్పోల్ ఉపాధ్యాయుడు పి. సిద్ధారెడ్డికి శారద ఎడ్యుకేషనల్ సొసైటీ స్కై లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జ్ఞాపికను అందజేసి, శాలువా, ప్రశంసా పత్రంతో సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సిద్ధారెడ్డి మాట్లాడుతూ.. మా తల్లిదండ్రులు, గురువులు, శ్రేయోభిలాషులందరి ఆశీస్సులతో అవార్డును అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. అవార్డు అందించిన సొసైటీ సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



కుళ్లిపోయిన గుడ్లు చూపుతున్న గ్రామస్తులు



హవ్వ.. ఇవేమి గుడ్లు!

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని ఫత్తేపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిపోయిన గుడ్లు పంపిణీ చేశారు. దీంతో సోమవారం గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. బాలింతలు, గర్భిణీలు, శిశువులకు పంపిణీ చేసే గుడ్లు కుళ్లిపోయి ఉండటంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. అక్కడే పగులగొట్టి నిరసన వ్యక్తం చేశారు. అధికారులు చొరవ తీసుకుని నాణ్యమైన గుడ్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ ముగిసిన చేపల పంచాయితీ

పుల్‌కల్(అందోల్): మండలంలోని మిన్‌పూర్ గ్రామంలో ఐదు నెలలుగా ముదురుతున్న చేపల చెరువుల పంచాయితీని సోమవారం జిల్లా అధికారులు పరిష్కరించారు. గ్రామ చెరువులోని చేపలపై ఒక సామాజిక వర్గానికే హక్కు ఉంటుందని కొందరు.. కాదు గ్రామస్తులందరికీ హక్కు ఉంటుందని మిగతా కులాల వారు పేర్కొనడంతో మృగశిర కార్తె నుంచి వివాదాలు మొదలయ్యాయి. గ్రామంలో తరుచుగొడవలు జరుగుతుండటంతో సోమవారం డీఎస్పీ సత్తయ్య, మత్స్యశాఖ ఏడీ నర్సింగ్‌రావు, ఆర్డీఓ పాండు, తహసీల్దార్ కృష్ణ గ్రామస్తులతో సమావేశం నిర్వహించి, సమస్యను పరిష్కరించారు.

◆ భవన నిర్మాణ అధ్యక్షుడిగా రమేష్

సదాశివపేట(సంగారెడ్డి): మండల భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం నూతన అధ్యక్షా కార్యవర్గ సభ్యులను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముంగి రమేష్, ప్రధాన కార్యదర్శిగా చిల్లపల్లి శంకరప్ప, ఉపాధ్యక్షుడిగా నాగేశ్, సహాయకార్యదర్శిగా లక్ష్మి, కోశాధికారిగా బుజ్జమ్మ, కమిటీ సభ్యులుగా శ్రీశైలం, అంజయ్య, సంజీవ రెడ్డి, నర్సింలు, నిర్మల ఎన్నికయ్యారు.

◆ సిర్గాపూర్‌లో ప్రజావాణి

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ఉమశంకర్ ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు భరోసా ఇచ్చారు.

◆ గ్రామసభలు

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలంలో సోమవారం ఉపాధి హామీ పనులపై గ్రామసభలు నిర్వహించారు. ఖాజపూర్, వాసర్ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం, అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్సూర్, ఎంపీఓ బ్రహ్మం, ఏపీఓ బస్వరాజ్, సెక్రటరీలు పాల్గొన్నారు.

◆ ఎస్ఐకు సన్మానం

మునిపల్లి(అందోల్): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గంధము సరస్వతీ మోమెరియల్ ట్రస్ట్ నిర్వాహకులు బుదేరా ఎస్ఐ రాజేశ్ నాయక్‌ను సన్మానించారు. అలాగే, హెడ్ కానిస్టేబుల్ సుందర్‌రావు, కానిస్టేబుల్ అనిఫ్, మల్లేశం, పాండు, హోంగార్డు సునీల్, శంకర్‌లకు శాలువా కప్పి మెమోంటో అందజే శారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్‌గోపాల్, మల్లికార్జున్, చంద్రమౌళి, ప్రవీణ్‌కుమార్, వెంకటేశం ఉన్నారు.

◆ అండర్-17 క్రికెట్ పోటీలకు ఎంపిక

జోగిపేట(అందోల్): పాఠశాల క్రీడా సమైఖ్య (ఎస్‌జీఎఫ్)ఆధ్వర్యంలో ఈనెల 19న ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ పోటీల్లో జోగిపేటకు చెందిన డాక్టర్ శ్రీకాంత్ కుమార్తె క్రిష్ణవేణి, ఉన్నత పాఠశాలకు చెందిన అల్లాదుర్గం ప్రగ్వీ ముదిరాజ్, అండర్ -17 బాలికల విభాగంలో ఎంపికయ్యారు.

◆ అప్రమత్తంగా ఉండాలి

సంగారెడ్డి టౌన్ : గాలికుంటు వ్యాధితో అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్య సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ యామిని అన్నారు. సోమవారం సంగారెడ్డి మండలంలోని పసల్వాదిలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో రైతులకు చేపడుతున్న అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆరో రోజు పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.

◆ వెయిట్ లిఫ్టింగ్‌లో రాష్ట్రస్థాయి ఎంపిక

కొండాపూర్(సంగారెడ్డి): ఇటీవల కరీంనగర్‌లో జరిగిన వెయిట్ లిఫ్టింగ్‌లో కొండాపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వెయిట్ లిఫ్టింగ్‌లో అండర్-44 కేజీల విభాగంలో 10వ తరగతి నందిని, అండర్-63 కేజీల విభాగంలో 10వ తరగతి విద్యార్థి ముస్కాన్, అండర్-77 కేజీల విభాగంలో 10వ తరగతి ముజీబ్ ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎలిజబెత్ రాణి, పీడీ గోపాలకృష్ణ, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

◆ ఎస్పీని కలిసిన టీఎన్జీఓ సభ్యులు

సంగారెడ్డి జోన్: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా ఎస్పీ రూపేష్‌ను టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు జావిద్ అలీ, ఇతర నాయకులు కలిశారు. ముందుగా పోలీసు అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టీఎన్జీఓ కార్యదర్శి రవి, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీకాంత్, సభ్యులు పి.వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, విజయ్‌కుమార్, వెంకటేశం, బలరాం, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

◆ అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

సంగారెడ్డి క్రైమ్: అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన సంగారెడ్డిలో చోటు చేసుకుంది. సీఐ భాస్కర్ కథనం ప్రకారం.. ఓ వ్యక్తి స్పృహ లేకుండా పడి ఉండడంతో అంబులెన్స్ డ్రైవర్ గమనించాడు. వెంటనే అతడిని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచినట్లు చెప్పారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

◆ చెరువులో వ్యక్తి మృతదేహం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని తంగడపల్లి చెరువులో సోమవారం ఓ వ్యక్తి మృతదేహం కుళ్లిన స్థితిలో లభ్యమైనట్లు సీఐ మహేష్ గౌడ్ తెలిపారు. మృతదేహాన్ని బయటకు తీసి బొబ్బిలిగామకు చెందిన నల్లోల్ల నాగరాజ్ (26)గా గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.